# అభివృద్ధికి పట్టం కట్టండి

- కాంగ్రెస్ బూటకపు హామీలను నమ్మద్దు
- బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యం
- రోడ్ షోలో మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



గుండ్లపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు గొర్రెపిల్లను బహూకరిస్తున్న గొల్ల కుర్మలు

గన్నేరువరం, నవంబర్ 9: బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేసిందని, ఎన్నికల్లో ప్రజలు రాష్ట్ర అభివృద్ధిని చూసి మరోసారి తమ పార్టీకి పట్టం కట్టాలని పార్టీ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. మండలంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, చీమలకుంటపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ లేదని, కవ్వంపల్లి మాటలకు వారెంటీ లేదని, ఆపార్టీ బూటకపు హామీలను నమ్మవద్దన్నారు. దొంగ దారిన అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదన్నారు. 60 ఏళ్ల పాలనలో చేయని అభివృద్ధిని ఇప్పుడు ఎలా చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు, సాగునీరు, తాగునీరు కోసం అరిగోసపడ్డామని గుర్తుచేశారు. రైతులపై ఆ పార్టీ విషం కక్కుతున్నదని, రైతుబంధు ఆపాలని చూసిన కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. ఆ పార్టీని నమ్మి ఓటువేస్తే రైతుల నోట్లో మట్టి కొడుతారన్నారు. ప్రచారానికి వచ్చిన రసమయి బాలకిషన్‌కు మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గడ్డం నాగరాజు, జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వెంకన్న, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను నమ్మితే అధోగతే

- సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- జైపాల్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్ గెలుపు ఖాయమైంది
- చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- కొత్త జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 3 వేల మంది బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్, పక్కన నాయకులు జైపాల్‌రెడ్డి

గంగాధర, నవంబర్ 9: కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేస్తే తెలంగాణను అధోగతిపాలు చేస్తారని, ప్రజలను కడుపులో పెట్టుకుని చూసుకునే సీఎం కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మైత్రీ గ్రూప్స్ చైర్మన్, కాంగ్రెస్ నేత కొత్త జైపాల్‌రెడ్డి చేరికతో చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని నాగిరెడ్డిపూర్‌లోని జైపాల్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌లో గురువారం చొప్పదండి నియోజవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు దాదాపు 3 వేల మంది జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ గెలుపు కోసం పని చేయాలని సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, చొప్పదండి నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేస్తామన్నారు. వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న జైపాల్‌రెడ్డి మిత్రమండలి సభ్యులు అంతా బీఆర్ఎస్‌లో చేరడంతో కాంగ్రెస్ ఖాళీ అయిందన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసకువెళ్లి ప్రచారం చేస్తామని, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి రెండో సారి అసెంబ్లీకి పంపుతామన్నారు. ఇక్కడ జైపాల్‌రెడ్డి మిత్ర మండలి సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి..

- అభివృద్ధి చేసి చూపిస్తా
- ఏకష్టం వచ్చినా అండగా ఉంటా..
- హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



లక్ష్మీపూర్‌లో వృద్ధుడిని కారుకు ఓటు వేయాలని కోరుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డి



లక్ష్మీపూర్‌లో మహిళ కు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థిస్తున్న శాలినిరెడ్డి

కమలాపూర్, నవంబర్ 9: 'ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌కు అవకాశం ఇచ్చినా అభివృద్ధి చేయలేదు. నాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తా' అని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని లక్ష్మీపూర్, నేరెళ్ల, గూడూరు గ్రామాల్లో కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు పడ్డ బాధలను గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో నేడు రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఏకష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు నెలకు రూ.3వేల భృతి అందజేయనున్నట్లు చెప్పారు. ఆసరా పెన్షన్లు, రూ.5లక్షలు ఉన్న ఆరోగ్య పథకం రూ.15లక్షలకు పెంచబోతున్నట్లు తెలిపారు. కేసీఆర్ బీమా.. ఇంటింటికీ ధీమాతో తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. తనను ఆదరించి ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి శాలినిరెడ్డి మహిళలకు బొట్టు పెట్టి అభ్యర్థించారు. కాగా, ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి దంపతులకు ప్రజలు పెద్ద ఎత్తున పూలుచల్లి, మంగళ హారతులతో స్వాగతం పలికారు. గ్రామాల్లో 'జై కౌశికన్నా' నినాదాలు మార్మోగాయి.

### హరీశ్‌రావు రోడ్ షోకు భారీగా తరలిరావాలి

కమలాపూర్, నవంబర్ 9: జమ్మికుంటలో శుక్రవారం మంత్రి తన్నీరు హరీశ్‌రావు రోడ్ షోకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. గురువారం కమలాపూర్ మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చిన కౌశిక్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జమ్మికుంట పట్టణంలో సాయంత్రం 3గంటలకు మంత్రి హరీశ్‌రావు రోడ్ షో ఉంటుందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న చెన్నమల్ల చైతన్య

# బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రానికి మహర్దశ

- గంగుల సారథ్యంలోనే కరీంనగర్‌కు ప్రగతి
- ఎస్‌యూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నమల్ల చైతన్య

కమాన్‌చౌరస్తా, నవంబర్ 9: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రానికి మహర్దశ వచ్చిందని, దేశంలోనే అగ్రగామిగా నిలుస్తూ దూసుకుపోతున్నదని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నమల్ల చైతన్య స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని మీసేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జేఏసీ, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానం నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, గంగుల కమలాకర్ రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాల్లో రాష్టం, జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, స్మార్ట్ సిటీ, ఐటీ హబ్, కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, మెడికల్ కళాశాల, తిరుమల తిరుపతి దేవస్థానం, ఇస్కాన్ టెంపుల్, రోడ్ల విస్తీర్ణం, ఫుడ్ కోర్ట్స్, సర్కస్ గ్రౌండ్, కొత్త కలెక్టరేట్ వంటి వాటితో ఎంతో అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నదని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి వన్నె తెచ్చిన కరీంనగర్ జిల్లా, ప్రస్తుతం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని, యువత భవిష్యత్తుకు బాటలు వేయాలి కానీ, వారికి భవిష్యత్తు లేకుండా చేయకూడదని హితవుపలికారు. ఉద్యమ సమయంలో 2009 సంవత్సరంలో డ్యాం కింద శాతవాహన యూనివర్సిటీ పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని, పాములు, తేళ్లతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ సావాసం చేస్తూ క్లిష్టమైన రోజులను గడిపామని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కడప జిల్లాలోని యోగి వేమన యూనివర్సిటీకి రూ.330 కోట్లు కేటాయించి, శాతవాహన యూనివర్సిటీకి కేవలం రూ.3 కోట్లు కేటాయించారని, అప్పుడు అధికారంలో ఉన్న ఇక్కడి నాయకులు నోరు మెదపలేదని మండిపడ్డారు. ఇప్పుడు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాన్ని మళ్లీ రాబందుల చేతిలో పెట్టవద్దన్నారు. కరీంనగర్‌కు మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో అభివృద్ధి సాధ్యమని నగర వాసులు నమ్ముతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, బీఆర్ఎస్ నాయకులు శనిగరం అరుణ్, కుందేటి సత్యనారాయణ, గడ్డమీది రాజశేఖర్, మిర్యాల తిరుపతి, గూడురి కుమార్, చారి, గడ్డమీది రాకేశ్, బండ అశోక్, ములకల విజయ్, నగనూరి చంద్రశేఖర్, బసవరాజ్, అభిలాష్, సూర రామ్ యాదవ్, వైష్ణవ్, వెంకటేశ్, వినయ్, అభిషేక్, అరవింద్, రుత్విక్ పాల్గొన్నారు.

# మంత్రికి వివిధ సంఘాల మద్దతు



మంత్రి గంగులకు మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల ప్రతినిధులు

కార్పొరేషన్, నవంబర్ 9: కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు నియోజకవర్గంలోని వివిధ కుల సంఘాలు మద్దతు ప్రకటిస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం వివిధ కుల సంఘాలకు చెందిన నాయకులు మంత్రి నివాసంలో ఆయనను కలిసి మద్దతు తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ లక్ష్మీనగర్‌కు చెందిన కుర్మ సంఘం ప్రతినిధులు, కరీంనగర్‌కు చెందిన విశ్వబ్రాహ్మణ కుల సంఘం నేతలు, కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన గౌడ సంఘం నాయకులు, నగరంలోని బుక్క కులసంఘం నాయకులు, కరీంనగర్ జువెల్లరీ అసోసియేషన్ అధ్యక్షుడు వంగల శ్రీధర్ ఆధ్వర్యంలో, విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం గౌరవ సలహాదారు కందుకూరి సాయికృష్ణ, బీఆర్ఎస్ పట్టణ వెండి బంగారం వర్తక సంఘం నాయకులు.. మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి తమ సంఘాల తరపున మద్దతు ప్రకటించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు కడార్ల నరేందర్, ముత్తోజు రాము, ఎర్రోజు రమణ, గాలిపెల్లి లక్ష్మణాచారి, కందుకూరి రాధాకృష్ణ, శ్రీరామోజు ఆశ్విన్‌కుమార్, ఎర్రోజు లక్ష్మీకాంత్, కడార్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక

మానకొండూర్, నవంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మానకొండూర్ మండలం నిజాయితీగూడెం బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి కుసుమ శ్రీనివాస్ గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, నాయకులు ఆడెపు రమేశ్, సామంతుల శ్రీనివాస్, కెమసారం కుమార్, పిట్టల మధు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్